సాక్షి
ఖమ్మం
సోమవారం । 6 । మార్చి । 2023



నల్ల దుమ్ముతో నరకం !

సింగరేణి జేవీఆర్ ఓసీ పరిధిలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నుంచి వచ్చే నల్లటి బొగ్గు దుమ్ము కిష్టారం గ్రామాన్ని చుట్టేస్తోంది. 8లో



వైదిక కమిటీలో విభేదాలు

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం వైదిక కమిటీలో నెలకొన్న విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
38° / 18°

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రత కొంత ఎక్కువగానే ఉంటుంది. రాత్రి చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

భూముల క్లెయిమ్ వివరాలు ఇవ్వండి

ఖమ్మంరూరల్: కోదాడ నుంచి కురవి వరకు జాతీయ రహదారి నిర్మాణంలో మండలంలోని తల్లంపాడు, ఆరేకోడు, ఆరెంపుల, ఎం.వెంకటాయపాలెం, కాచిరాజుగూడెం గ్రామాల రైతులు భూములు కోల్పోనున్నారు. ఈ మేరకు రైతుల వివరాలను ఖమ్మం ఆర్డీఓ కార్యాలయంలో 15 రోజుల్లో సమర్పించాలని అధికారులు సూచించారు. భూనిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించాల్సిన ఉన్నందున భూమి వివరాలు, అనుసంధానంగా కట్టడాలు, చెట్ల వివరాలతో పాటు బ్యాంక్ అకౌంట్ పత్రాలు సమర్పించాలని తెలిపారు.

నాలుగో తరగతి ఉద్యోగుల కమిటీ ఎన్నిక

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన కోడి లింగయ్య గత నెలలో ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో నూతన అధ్యక్షుడిగా గుగులోతు బిక్కు, సహాయ అధ్యక్షులుగా ఓదేలు, ఉపాధ్యక్షులుగా వై.రామారావు, మురళీమోహన్, కార్యదర్శిగా కె.వెంకటరమణ, సహాయ కార్యదర్శులుగా జె.నర్సింహారావు, బి.వెంకటేశ్వర్లు, అబ్దుల్ గఫూర్, కోశాధికారిగా అజ్మత్ బేగ్, ప్రచార కార్యదర్శిగా చావా నారాయణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా హమీద్, ఆఫీస్ కార్యదర్శిగా కనకరావుతో పాటు మరో ఏడుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

బ్యాటరీ కారు తయారీలో ప్రతిభ



ఉదయ్ భాస్కర్ టీం రూపొందించిన కారు

కూసుమంచి: బ్యాటరీతో నడిచే గోల్ఫ్ కోర్ట్ కారు రూపకల్పనలో గట్టుసింగారం గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి దారా ఉదయ్‌భార్గవ్ ప్రతిభ చూపాడు. హైదరాబాద్‌లో ట్రిపుల్ ఈ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఉదయ్.. తన టీంతో కలిసి కారును రూపొందించాడు. ఈ కారు గంటకు 20 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందని, 48 వోల్ట్స్ బ్యాటరీ సామర్థ్యంతో ఒకసారి చార్జింగ్ చేస్తే 70 కిలోమీటర్ల దూరం వెళ్లవచ్చని ఉదయ్ 'సాక్షి'కి తెలిపాడు. క్యాట్ అప్రూవల్ కోసం ఈ ప్రయోగాన్ని ఉంచామని, ప్రస్తుతం ఇండోర్‌లో ప్రయోగిస్తున్నామని వివరించాడు.

భద్రగిరిలో భక్తుల సందడి



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. ఆదివారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

శ్రీకనకదుర్గమ్మ తల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ తల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు జరిపారు. తలనీలాలు సమర్పించారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

యాసంగి.. కళకళ

- 3.09 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- వరి, మొక్కజొన్నకే రైతుల ప్రాధాన్యం
- ఇతర పంటల సాగు నామమాత్రమే
- రబీ లెక్కలు తేల్చిన అధికారులు



కూసుమంచి డివిజన్‌లో వరిపైరు



ఖమ్మంవ్యవసాయం: జలాశయాల్లో, భూగర్భంలో సమృద్ధిగా నీరు ఉండడం, ప్రభుత్వం ఆంక్షలు విధించకపోవడంతో ప్రస్తుత యాసంగి సీజన్‌లో జిల్లాలో వివిధ రకాల పంటలు విస్తారంగా సాగయ్యాయి. జిల్లాకు ప్రధాన నీటి వనరైన నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరుండడం, యాసంగికి విడుదల చేస్తుండడం రైతులకు కలిసొచ్చింది. దీంతో జిల్లాలో ప్రధాన పంటైన వరితో పాటు వనరులను బట్టి మొక్కజొన్నపై కూడా దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3,10,257 ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగవుతాయనే అంచనాతో ప్రణాళిక రూపొందించగా, 3,09,069 ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఈ మొత్తంలో వరి, మొక్కజొన్న పంటలే సింహభాగం ఉన్నాయి. కాగా, జిల్లాలో గతేడాది యాసంగిలో 2.11 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేయగా, ఈ ఏడాది 3.09 లక్షల ఎకరాలకు పెరగడం విశేషం.

2.10 లక్షల ఎకరాల్లో వరి..

ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి 2,10,684 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గత యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల సమస్య కారణంగా వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ప్రభుత్వం సూచించింది. దీంతో అప్పుడు 1,05,607 ఎకరాల్లో మాత్రమే ఈ పంట సాగు చేశారు. ఈసారి ఆంక్షలు లేకపోవటంతో గత ఏడాదికి రెట్టింపు స్థాయిలో నాట్లు వేశారు. సత్తుపల్లి వ్యవసాయ డివిజన్‌లో అత్యధికంగా 1,03,853 ఎకరాల్లో పంట సాగు చేయగా, కూసుమంచి డివిజన్‌లో 61,944 ఎకరాలు, మధిర డివిజన్‌లో 22,203 ఎకరాలు, వైరా డివిజన్‌లో 19,593 ఎకరాలు, అత్యల్పంగా ఖమ్మం డివిజన్‌లో 3,088 ఎకరాల్లో ఈ పంట సాగు చేస్తున్నారు. సాధారణంగా యాసంగిలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇస్తారు. కానీ సమృద్ధిగా నీరు ఉండటంతో రైతులు వరి సాగుకు మొగ్గు చూపారు.

ఇతర పంటలు అంతంతే..

ఈ యాసంగి సీజన్‌లో ఇతర పంటల సాగు జిల్లాలో నామమాత్రంగానే ఉంది. పెసలు, కందులు, మినుములు వంటి పప్పు దినుసుల పంటలు 3,723 ఎకరాల్లో, పత్తి, చెరకు, స్వీట్ కార్న్, పొగాకు వంటి వాణిజ్య పంటలు 3,332 ఎకరాల్లో, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి నూనె గింజల పంటలు 968 ఎకరాల్లో, గడ్డి జాతి పంటలు 141 ఎకరాల్లో, పచ్చిరొట్ట ఎరువులు 110 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

ఆశాజనకంగా పంటలు

యాసంగి సీజన్‌లో జిల్లాలో సాగు చేస్తున్న పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. సత్తుపల్లి, కూసుమంచి డివిజన్లలో వరి పొట్ట దశలో ఉండగా, ఖమ్మం, మధిర డివిజన్లలో పిలక, చిరుపొట్ట దశల్లో ఉంది. వైరా డివిజన్‌లో పిలక దశలో ఉంది. మొక్కజొన్న కంకి పోసుకునే దశ నుంచి కండె దశకు చేరింది. ఇప్పటి వరకు తెగుళ్ల సమస్యలు అంతగా లేవని రైతులు చెబుతున్నారు. అయితే సాగర్ కాల్వలకు నల్లగొండ జిల్లాలో బుంగల కారణంగా నీరు ఆశించిన మేరకు సరఫరా కావడం లేదని, పగటి పూట మాత్రమే విద్యుత్ సరఫరా ఉండటంతో మోటార్లు పనిచేయక నీటి ఎద్దడి సమస్య తప్పడం లేదని అంటున్నారు.

89,831 ఎకరాల్లో మొక్కజొన్న..

మొక్కజొన్నతో అధిక ఆదాయం వస్తుందని భావించిన రైతులు ప్రస్తుత సీజన్‌లో 89,831 ఎకరాల్లో సాగు చేశారు. గత యాసంగితో పోలిస్తే ఈ పంట సాగు విస్తీర్ణం కూడా ఎక్కువే. గత సీజన్‌లో 81,658 ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. మెరక భూముల్లో, సాగర్ చివరి ఆయకట్టు నేలల్లో రైతులు ఈ పంటను సాగు చేశారు. మధిర వ్యవసాయ డివిజన్‌లో అత్యధికంగా 55,802 ఎకరాల్లో, వైరా డివిజన్‌లో 17,942 ఎకరాలు, కూసుమంచి డివిజన్‌లో 6,708 ఎకరాలు, సత్తుపల్లి డివిజన్‌లో 5,930 ఎకరాలు, ఖమ్మం డివిజన్‌లో 3,448 ఎకరాల్లో మొక్కజొన్న వేశారు.



మధిర డివిజన్‌లో మొక్కజొన్న

వరి, మొక్కజొన్న సాగు చేస్తున్నా



సమృద్ధిగా నీరు ఉండడంతో యాసంగి సీజన్‌లో 5 ఎకరాల్లో మొక్కజొన్న, రెండెకరాల్లో వరి పంట సాగు చేస్తున్నా. మొక్కజొన్న కొంత లేత కంకి దశలో ఉండగా, మరికొంత కండె దశకు చేరుకుంది. వరి పిలక దశ నుంచి చిరుపొట్ట దశలో ఉంది. ఇప్పటి వరకు పైర్లు బాగానే ఉన్నాయి. విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తే నీటి సమస్య కూడా ఉండదు. – మడికంటి శ్రీను, పిండిప్రోలు, తిరుమలాయపాలెం మండలం

యాసంగిలో సాగు చేసిన ప్రధాన పంటల వివరాలు(ఎకరాల్లో)

పంట	సాధారణ సాగు	సాగైన విస్తీర్ణం
వరి	2,13,809	2,10,684
మొక్కజొన్న	79,557	89,831
పెసర	7,227	3,141
వేరుశనగ	2,238	487
చెరకు	1,478	3,166
నువ్వులు	1,294	420
మినుము	1,131	308

లక్ష్యం మేరకు పంటల సాగు



వ్యవసాయ శాఖ అంచనాల మేరకు యాసంగి పంటలు సాగవుతున్నాయి. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వరి, మొక్కజొన్న పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. తెగుళ్లు అంతగా లేవు. నీటి ఎద్దడి రాకుండా ప్రభుత్వ శాఖలు చర్యలు తీసుకుంటున్నాయి. పంట దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయని భావిస్తున్నాం.
– ఎం.విజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారి

ఏఈ పరీక్ష ప్రశాంతం

ఖమ్మం సహకారనగర్ : టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 14 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షకు 6,049 మంది అభ్యర్థులకు గాను 4,696 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 6,049 మందికి గాను 4,679 మంది హాజరయ్యారు.

ఈసారి నయమే..

ఇటీవల కాలంలో జరుగుతున్న పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తూ పరీక్ష సమయానికి అనుగుణంగా వచ్చిన అభ్యర్థులను అనుమతిస్తూ, ఆలస్యంగా వచ్చిన వారిని వెనక్కు పంపిస్తున్నారు. అయితే ఏఈ పరీక్షకు అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి పరీక్ష నిర్వహించనుండగా 9 : 45 గంటల వరకు మాత్రమే అనుమతిస్తామని అధికారులు స్పష్టం చేయడంతో దాదాపు అభ్యర్థులంతా సకాలంలోనే కేంద్రాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం పరీక్షకు సైతం సకాలంలో హాజరయ్యారు. ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రంలోని అనుమతించలేదు.

అదనపు కలెక్టర్ తనిఖీ..

ఏఈ పరీక్షలను జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ పర్యవేక్షించారు. నగరంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్



ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ కేంద్రంలో అభ్యర్థులను తనిఖీ చేసి పంపిస్తున్న సిబ్బంది



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

వైభవంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు



పోటీలు ప్రారంభిస్తున్న సండ్ర వెంకటవీరయ్య

వేంసూరు: మండల పరిధిలోని కందుకూరులో కొలువుదీరిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా కొనసాగింది. స్వామివారిని మల్లె, కనకాంబరం, సన్నజాజి, తులసి, చామంతి, బంతి, గులాబి తదితర పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆదివారం రాత్రి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారు అమ్మవారి మెడలో మాంగళ్యధారణ చేశారు. అంతకుముందు అర్చకులు హవనం, బలిహరణం, నిత్యహోమం తదితర పూజలు నిర్వహించారు. కల్యాణం సందర్భంగా కందుకూరు గ్రామం గోవింద నామ స్మరణలతో మార్మోగింది. కాగా, ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు ప్రారంభం..

కందుకూరులో శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒంగోలు జాతి ఎడ్లు కనుమరుగైపోతున్న తరుణంలో వాటి పరిరక్షణకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశువులను పూజించడం మన సంప్రదాయమని, భారతీయ రైతులకు ప్రతీకగా ఒంగోలు జాతి ఎద్దులు నిలుస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మందపాటి వెంకటరెడ్డి, బండి జగదీష్ రెడ్డి, ఎంపీపీ పగట్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ బూరుగు నాగేశ్వరరావు, గొర్ల ప్రభకర్ రెడ్డి, పాలా వెంకటరెడ్డి, గొర్ల శ్రీనివాసరెడ్డి, దొడ్డా వెంకటకృష్ణారెడ్డి, మారోజు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్ : టీఎన్‌జీవోస్ మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలకు పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేందుకు, క్రీడల ద్వారా ఐక్యత చాటేందుకు ఇలాంటి పోటీలు దోహదపడుతాయని అన్నారు. క్రీడాపోటీల వల్ల మానసిక, శారీరర ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి ఏటా టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్ మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగుల్లో పని భారం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ప్రతి ఏటా క్రీడా పోటీలు నిర్వహించి వారిలో ఉత్సాహం నింపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఆర్.వి.ఎస్.సాగర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు శాబాసు జ్యోతి, కార్యదర్శి స్వప్న, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నందగిరి శ్రీను, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వీరానారయణ, షేక్ నాగుల్‌మీరా, బుద్దా రామకృష్ణ, ఆర్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ క్రీడల్లో తొలి రోజు రన్నింగ్, కబడ్డీ, టెన్నికాయిట్, స్కిప్పింగ్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్

మాయమాటల్లో కేసీఆర్ దిట్ట



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన ఆయన అనుచరులు

- మరోసారి మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరు
- ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారు
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి

తిరుమలాయపాలెం: మాయమాటలు చెప్పడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిట్ట అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. బంగారు తెలంగాణ చేస్తానంటూ ఓట్లు వేయించుకుని అప్పుల తెలంగాణగా మార్చిన ఆయన మాటలు నమ్మి మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. తిరుమలాయపాలెంలో ఆదివారం నిర్వహించిన పాలేరు నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను నేడు రూ.4.86 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిపై రూ.1.30లక్షల అప్పు మోపారని అన్నారు. ఉప ఎన్నికలప్పుడే దళితబంధు, గిరిజన బంధు పథకాలు గుర్తుకొస్తాయని, ఆయా నియోజకవర్గాల్లో ఈ పథకాలతో ఫలితాలు ఎలా వచ్చాయో ప్రజలకు తెలుసని చెప్పారు. ఒక్కో నియోజకవర్గంలో 100 మందికే దళితబంధు ఇచ్చారని, గిరిజన బంధుకు దిక్కే లేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఏ గ్రామంలోనూ 20కి మించి నిర్మించలేదని విమర్శించారు. రుణమాఫీ చేస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ నేటికి నెరవేరలేదని, 36.86 లక్షల మంది రైతుల్లో 5.86లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేశారని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే తక్కువ నిధులు కేటాయిస్తున్నది తెలంగాణలోనేనని, ఇలా చేస్తే సామాన్యులకు విద్య, వైద్యం ఎలా అందుతుందని ప్రశ్నించారు. మాయమాటలతో గారడీ చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించడమే మనముందున్న తక్షణ కర్తవ్యమని పిలుపునిచ్చారు. జిల్లాలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు తమకెవరూ అడ్డు లేరంటూ విర్రవీగుతున్నారని, రానున్న ప్రభంజనంలో వారు గల్లంతు కావడం ఖాయమని స్పష్టం చేశారు. పదవి ఉన్నా, లేకున్నా ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మహిళా నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి మాట్లాడుతూ.. పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. ప్రగతిభవన్‌లో పాలేరు నియోజకవర్గాన్ని పాలేరుగా పెట్టి పదవులు పొందారని, సొంత గ్రామం పిండిప్రోలులో వార్డు మెంబర్‌గా అయినా పోటీ చేసి గెలిచారా అని ప్రశ్నించారు. మరో నేత రామసహాయం నరేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి వైఎస్సార్ విగ్రహాలు తొలగించారని, వైఎస్ పుణ్యాన గెలిచి ఇలాంటి చర్యలకు పాల్పడితే ఇంటికో విగ్రహం పెట్టిస్తామని అన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నాయకులు చావా శివరామకృష్ణ, డాక్టర్ కోట రాంబాబు, విజయాబాయి, నెల్లూరి భద్రయ్య, వెంకటరెడ్డి, స్వర్ణ, పెంటమల్ల పుల్లమ్మ, మద్ది కిషోర్‌రెడ్డి, కార్పొరేటర్ దొడ్డా నగేష్, మొగిలిశెట్టి నరేష్, దుబాకుల వెంకటేశ్వర్లు, మక్తల వెంకటేశ్వర్లు మాజీ ఎంపీపీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

13 వరకు పోలీస్ యాక్ట్

ఖమ్మంక్రైం: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈనెల 13 వరకు ఖమ్మం కమిషనరేట్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ విష్ణు ఎస్ వారియర్ తెలిపారు. ఆంక్షలు అమలులో ఉన్నందున అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. సాధారణ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

మురిపించి.. మైమరపించి..

- ఆహూతులను అలరించిన సప్తకళల ప్రదర్శన
- వేడుకలను ప్రారంభించిన ఏఎంసీ చైర్‌పర్సన్ శ్వేత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఖమ్మం వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత

ఖమ్మంగాంధీచౌక్: సప్తకళల ప్రదర్శన సభికులను అలరించింది. ప్రతిభాపాటవాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. ఫైర్ ప్రార్థవిక, పండు ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో సప్తకళల సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. ఖమ్మం కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేల్పుల విజేత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జానపద గేయాల గానంతో కళారత్న, తెలంగాణ ఉద్యమ గేయ రచయిత, గాయకులు గిద్దె రామనర్సయ్య బృందం ఆహూతులను ఉర్రూతలూగించింది. ఫైర్ ప్రార్థవిక, పండుల రింగ్ డ్యాన్స్, మ్యాజిక్ షో చూపరులను కట్టిపడేశాయి. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన మిమిక్రీ ఆర్టిస్టు ప్రదర్శన ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది. కైరేళి డ్యాన్స్ అకాడమీ భరత నాట్యం గ్రూపు డ్యాన్స్ అదరహో అనిపించింది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ముంబాయికి చెందిన కిషన్ జగ్లింగ్, కత్తుల ప్రదర్శనలో తెగువ చూపారు. ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ హోల్డర్ ఫైర్ రవి ఫైర్ డ్యాన్స్, విన్యాసాలు ఆకట్టుకోగా, సినీ గాయకులు జాన్ పాడిన జానపద గేయాలు రంజింపచేశాయి. ఈ సందర్భంగా కళావాచస్పతి, నటుడు, వ్యాఖ్యాత, నంది అవార్డు గ్రహీత జి.రవీంద్ర, ప్రముఖ మెజీషియన్, నటులు, దర్శకులు రామడుగు వసంత్, సినీ, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ గేయ రచయిత అవార్డు గ్రహీత యశ్‌పాల్, ప్రముఖ రచయిత, దర్శకులు కొత్తపల్లి శేషు, కమెడియన్, వాఖ్యాత మొగిలి గుణాకర్‌లను నిర్వాహకులు శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు.

కళల గుమ్మం ఖమ్మం..

ఖమ్మం భిన్నమైన కళల గుమ్మమని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత అన్నారు. సప్తకళల సమ్మేళనాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ఖమ్మం నగరానికి చెందిన కళాకారులు, సాహితీవేత్తలు తమ ప్రతిభతో గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఫైర్ రవి బృందం సప్త కళల ప్రదర్శన అభినందనీయమని అన్నారు. ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి మాట్లాడుతూ భిన్నమైన కళలతో అనేక మంది కళాకారులు ముందుకు వస్తున్నారని, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రరావు, కళాశాలల అధ్యక్షుడు చల్లా శేషగిరిరావు, అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు మోటమర్రి జగన్మోహన్‌రావు, సంక్రాతి ప్రసాద్, పుచ్చకాయల రవికుమార్, కొదుమూరి రమేష్, బొల్లు సైదులు, నంది అవార్డు గ్రహీత రామడుగు వసంతకుమార్, సినీగేయ రచయిత యశ్‌పాల్, హాస్య నటుడు మొగిలి గుణకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మన్విత్‌కు జిల్లా జడ్జి అభినందన



బొర్రా మన్విత్‌ను అభినందిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

సత్తుపల్లిటౌన్: చిన్నవయస్సులోనే తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏపీజే అబ్దుల్ కలాం బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన సత్తుపల్లి విశ్వశాంతి విద్యాలయం 4వ తరగతి విద్యార్థి బొర్రా మన్విత్‌జగన్నాథ్‌నాయుడును ఆదివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు అభినందించారు. సత్తుపల్లి అటవీశాఖ అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో మన్విత్ ప్రతిభను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలుడిని సత్కరించారు. కార్యక్రమంలో సత్తుపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవీ రాజేంద్రప్రసాద్, అదనపు జిల్లా జడ్జి శివరామప్రసాద్, జూనియర్ సివిల్ జడ్జి శ్రావణ స్వాతి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అయేషాషరీనా, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.గోపాల్‌రావు, న్యాయవాదులు వెంకట్రావు, జగన్నాథాచారి, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

షాహిన్ లాయఖ్‌కు డాక్టరేట్



షాహిన్ లాయఖ్

ఖమ్మంసహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో నగరానికి చెందిన షాహిన్ లాయఖ్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.మంజుల పర్యవేక్షణలో 'క్లాసిఫికేషన్ ఆఫ్ ఇన్‌బాలెన్స్‌డ్ డేటా యూసింగ్ మెషిన్ లెర్నింగ్' పరిశోధన గ్రంథం సమర్పించినందుకుగాను కాకతీయ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా షాహిన్ లాయఖ్‌కు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, స్నేహితులు అభినందనలు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని కాచిరాజుగూడెం పరిధి రేగులతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రేగులతండాకు చెందిన ధరావత్ కృష్ణ (46) ఆదివారం ఆకేరుపై చేపల వేటకు వెళ్లాడు. ఏటిలోని ఓ మడుగులో విద్యుత్ వైరుతో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థికి గాయాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 12వ డివిజన్ రాధాకృష్ణనగర్ వద్ద రోడ్డు దాటుతున్న వైద్య విద్యార్థిని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి గాయాలవగా ఆదివారం ఖమ్మంఅర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. హన్మకొండ జిల్లా పరకాలకు చెందిన ఆకుల నిఖిల్ మమత కాలేజీలో వైద్యవిద్య అభ్యసిస్తున్నాడు. ఈ నెల 4న స్టేషనరీ కోసం దుకాణానికి వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనువాద సంకెళ్లను బద్ధలు కొట్టాలి..

- మావోయిస్టు బీకేఏఎస్‌ఆర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్

చర్ల: ఆకాశంలో సగం, సమాజంలో సగం, పోరాటంలో సగం అని నినదిస్తూ మనువాద సంకెళ్లను బద్ధలు కొట్టి మహిళా విముక్తిని సాధించాలని, మహిళలపై జరుగుతున్న బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి, రాజ్యహింసకు వ్యతిరేకంగా 113వ అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని మార్చి 8న జరుపుకుందామని మావోయిస్టు భద్రాద్రి కొత్తగూడెం, తూర్పు గోదావరి జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పత్రికలకు ఒక లేఖ విడుదల చేశారు. లేఖలోని వివరాల ప్రకారం.. పని గంటల తగ్గింపు, స్త్రీలకు ఓటు హక్కు, మెరుగైన జీతభత్యాల కోసం 1908లో న్యూయార్క్ పట్టణంలో 1,500 మంది మహిళల ప్రదర్శనతోనే మార్చి 8కి బీజాలు పడ్డాయని, అప్పటి నుంచే ప్రపంచ మహిళా దినోత్సవం కొనసాగుతోందని తెలిపారు. నేడు సమాజంలో మహిళలకు పాలకులు వివిధ ఆకర్షణీయ పథకాలు ప్రవేశ పెడుతూ, అణచివేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆధునిక పెట్టుబడిదారీ యుగంలో అత్యంత లాభదాయకమైన వ్యాపార సరుకుగా మహిళలను మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు తమ హక్కులను పోరాడి సాధించుకోవాల్సిన అవసరం ఉందని, సమాజ విముక్తిలోనే స్త్రీవిముక్తి ఉందనే విషయాన్ని స్త్రీలు గుర్తించాలని సూచించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,961

నల్ల దుమ్ముతో నరకం !

సింగరేణి కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నుంచి విస్తరిస్తున్న కాలుష్యం

- కేహెచ్‌పీకి నీటి సరఫరా నిలవడమే కారణం
- భరించలేకపోతున్నామంటూ కిష్టారం వాసుల ఆందోళన
- సింగరేణి అధికారులు స్పందించాలని వేడుకోలు



కిష్టారం ఓసీలో లేస్తున్న బొగ్గు దుమ్ము

సత్తుపల్లి: నల్లటి బొగ్గు మసి.. బయట ఉండలేని పరిస్థితి.. కనీసం బట్టలు ఆరబెట్టుకోలేని దుస్థితి.. ఇదీ సత్తుపల్లి మండలంలోని కిష్టారం గ్రామస్తుల దయనీయ పరిస్థితి. ఓపెన్‌కాస్టులు కిష్టారం గ్రామాన్ని చుట్టుముట్టేశాయి. జేవీఆర్ ఓసీ మొదలు కిష్టారం ఓసీ వరకు బొగ్గు తవ్వకాలు విస్తరించటంతో గ్రామస్తులకు స్వచ్ఛమైన గాలి, వెలుతురు కరువైంది. దీనికి తోడు కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్ నుంచి వచ్చే నల్లటి బొగ్గు దుమ్ము గ్రామాన్ని చుట్టేస్తోంది. ప్రతిరోజు ఇదే తరహాలో జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరించటం పట్ల స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్వాసకోశ వ్యాధులతో సావాసం చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

వాటర్‌లైన్ నిలిపివేయడంతోనేనా?

ఓసీల నుంచి రైల్వే లైన్‌ల ద్వారా బొగ్గు రవాణా కోసం రూ.400 కోట్లతో కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్ నిర్మించారు. అత్యంత ఆధునీకరణంగా నిర్మించామని అధికారులు చెప్పినా ఆచరణలో ఆ పరిస్థితి లేదు. కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్ నుంచి బొగ్గు రవాణా చేసేందుకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మించారు. దీనికి అనుసంధానంగా బొగ్గు రవాణా సమయంలో దుమ్ము లేవకుండా, అగ్ని ప్రమాదాలు జరగకుండా వాటర్‌లైన్ ఏర్పాటు చేశారు. కానీ డంపర్ వద్ద బొగ్గు లోడింగ్ చేసినప్పుడు బొగ్గు పెళ్లలు కన్వేయర్ బెల్ట్‌కు అతుక్కొని ఇబ్బందులు వస్తున్నాయని చెబుతూ నీటి సరఫరాను నిలిపివేసినట్లు సమాచారం. దీంతో క్రషర్ స్టేషన్ నుంచి మొదలు సైలో బంకర్ వరకు నల్లటి దుమ్ము రేగుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లోడింగ్‌లు పెరిగితే..

రైల్వే వ్యాగన్ల ద్వారా రోజుకు కనీసం 7 నుంచి 8 రేక్‌ల బొగ్గు రవాణా చేయాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. కిష్టారం ఓసీ నుంచి బొగ్గు టిప్పర్ల ద్వారా క్రషింగ్ స్టేషన్‌కు తరలిస్తున్నారు. అక్కడ రెండు క్రషింగ్ బంకర్లు నిత్యం పని చేయాల్సి వస్తోంది. రోజుకు కనీసం 32 నుంచి 40 వేల టన్నుల బొగ్గు రవాణా చేయాలనేది అధికారుల లక్ష్యం. ఇది బాగానే ఉన్నా ఎక్కడా దుమ్ము లేవకుండా చర్యలు చేపట్టకపోవడంతో స్థానికులకు ప్రాణసంకటంగా మారింది.

పరిస్థితి దారుణంగా ఉంది..



బొగ్గు దుమ్ము గాలి ఎటువైపు వీస్తే అటు వస్తుంది. బయట కనీసం నిలబడి ఉండలేం. ఇళ్లు, వాకిళ్లు అన్నీ మసితో పేరుకుపోతున్నాయి. బయట రెండు, మూడుసార్లు నీళ్లు చల్లాల్సి వస్తోంది. ఒక్క వస్తువు కూడా బయటపెట్టలేకపోతున్నాం.

– రావి నాగేశ్వరరావు, కిష్టారం

తక్షణ చర్యలు చేపడుతాం..



దుమ్ము రేగుతున్న విషయం నా దృష్టికి రాలేదు. దీనిపై అధికారులతో చర్చించి తక్షణం చర్యలు చేపడతాం. ఇక నుంచి దుమ్ము లేవకుండా నీళ్లు చల్లుతాం. సోమవారం ఆ ప్రాంతాన్ని సందర్శించి తగిన ఏర్పాటు చేస్తాం.

– జక్కం రమేష్, జీఎం, సత్తుపల్లి

మెగా జాబ్‌మేళా విజయవంతం

- 670 మందికి అవకాశాలు
- విజయ కళాశాల వైస్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి



మాట్లాడుతున్న పారుపల్లి విజయలక్ష్మి



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ప్రతినిధులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో ఉన్న విజయ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్ జేఎన్‌టీయూ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైందని, పలువురు విద్యార్థులు ఆయా కంపెనీలలో ఉద్యోగాలు సాధించడం హర్షణీయమని విజయ ఇంజనీరింగ్ కళాశాల వైస్‌చైర్‌పర్సన్ పారుపల్లి విజయలక్ష్మి అన్నారు. ఆదివారం కళాశాలలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాబ్‌మేళాలో దాదాపు 40 కంపెనీల ప్రతినిధులు ఎంపికలు నిర్వహించగా 3,200 మంది వివిధ విభాగాలకు చెందిన యువతీ యువకులు హాజరయ్యారన్నారు. వారిలో 170 మందికి అప్పటికప్పుడే నియామక ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు. మరో 500 మందికి చివరి రౌండ్ పూర్తి అయిన తర్వాత సోమవారం నియామక ఉత్తర్వులు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమం విజయవంతమయ్యేందుకు సహకరించిన అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జాన్‌బాబు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఫరీద్‌బాబా పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ వీడీజీ–2గా 'నంబూరి'



నంబూరి మధుసూదన్‌రావు దంపతులు

వైరా: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320 ఈ–వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్–2గా వైరాకు చెందిన లయన్ నంబూరి మధుసూదన్‌రావు ఘన విజయం సాధించారు. ఆదివారం నల్లగొండ పట్టణంలో జరిగిన జిల్లా ఎన్నికలలో ఆయన 113 ఓట్ల తేడాతో గెలుపొందారు. మొత్తం 255 ఓట్లు నమోదు కాగా మధుసూదన్‌రావుకు 184 ఓట్లు రాగా మరో అభ్యర్థి సత్యనారాయణరెడ్డికి 71 ఓట్లు లభించాయి. ఈ సందర్భంగా మధుసూదన్‌రావు మాట్లాడుతూ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయన విజయం పట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శీలం వెంకటనర్సిరెడ్డి, పాదిల హరినాథ్, యడ్లపల్లి వీరయ్యచౌదరి, కట్ల రంగారావు, బీఆర్‌ఎస్ నాయకులు పి.మోహన్‌రావు, కె.హనుమంతరావు, ఎం.దుర్గాప్రసాద్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, జెడ్పీటీసీ సభ్యురాలు నంబూరి కనకదుర్గ, లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, గ్రేట్ విజన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతోజు నాగేశ్వరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఇల్లెందు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

- సుదిమళ్ల, కొమరారం, బోడు మండలాలు ఏర్పాటు చేయండి
- అఖిలపక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: ఇల్లెందును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, కొమరారం, బోడు మండలాలను ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు కోరా రు. ఆదివారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథి గా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పాల్గొని ప్రసంగించారు. 2016లో జిల్లాల పునర్విభజనతో రెండు మండలాలు మహబూబాబాద్‌లోకి.. ఒక మండలం ఖమ్మంలోకి వెళ్లగా కేవలం రెండు మండ లాలే మిగిలినా ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం విడ్డూ రంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్‌కు ఈ ప్రాంతం పట్ల నిర్లక్ష్యం ఉందని, సిద్దిపేట, సిరిసిల్ల, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్‌లకు మాత్రమే అభివృద్ధి దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఇల్లెందుకు పూర్వ వైభవం రావాలంటే ఇల్లెందు కేంద్రంగా రెవె న్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, సుదిమళ్ల, బోడు, కొమురారంలను కొత్త మండలాలుగా ఏర్పాటు చేయాలని కోరారు. కాగా, ఈ నెల 6న పాత బస్టాండ్ సెంటర్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో అబ్దుల్ నబీ, ఉడుత ఐలయ్య, పులి సైదులు, డానియేల్, భద్రూనాయక్, నగారపు రాములు, బట్టు శ్రీనివాస్, తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్, జాఫర్, మాచర్ల సత్యం, జాటోతు కృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.

సాగర్ కెనాల్‌లో మహిళా కూలీ గల్లంతు

నేలకొండపల్లి: సాగర్ కెనాల్‌లో చెరకు నరికే మహిళా కూలీ గల్లంతైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా, పుల్లలచెరువు మండలంలోని గంగారం గ్రామానికి చెందిన 11 మంది చెరుకు నరికే కూలీలు మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీకి మూడు నెలల కిందట వచ్చారు. ఫ్యాక్టరీ పరిధిలో వివిధ ప్రాంతాల్లో చెరుకు నరి కే చోటనే గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. చెరుకు నరికే ముఠాకు చెందిన రూప (17) ఆదివారం సాయంత్రం సాగర్ కెనాల్ వైపు వెళ్లినట్లు తోటి కూలీలు చెబుతున్నారు. ఎంతకీ కూలీల వద్దకు రాకపోవటంతో సహచర కూలీ లు అనుమానంతో కాలువ వద్దకు వెళ్లారు. రాత్రి వరకు కాలువ వెంట వెతికినా ఆచూకీ లభించలేదు. రాత్రి కావడంతో గాలింపునకు ఇబ్బందిగా మారింది.

కట్టపై రూపకు చెందిన చెప్పులు పడి ఉండటాన్ని గమనించారు. కాలువలో ప్రమాదవశాత్తు జారి గల్లంతైనట్లు తోటి కూలీలు భావిస్తున్నారు. ఐదు నెలల కిందట రూప తండ్రి చనిపోయాడు. తల్లిని ఇంటి వద్దనే ఉంచి, కుటుంబానికి అండగా ఉందామని పనులకు వచ్చిందని సహచర కూలీలు బోరున విలపించారు.

అలరించిన గొర్రెపొట్టేళ్ల పోటీలు



తలపడుతున్న పొట్టేళ్లు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో శ్రీఅంకమ్మతల్లి, శ్రీఅక్కమ్మ పేరంటాళ్ల శ్రీరామలింగయ్య స్వామి తిరునాళ్ల సందర్భంగా ఆదివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాలస్థాయి నాటు తగురు గొర్రె పొట్టేళ్ల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని (రూ.15,116) ఎర్రుపాలెం మండలం రాజులదేవరపాడు గ్రామానికి చెందిన కోమటి అజీస్‌కు చెందిన పొట్టేళ్లు గెలుచుకోగా, ద్వితీయ, తృతీయ బహుమతులను (రూ.12,116, రూ.10,116) ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా ఖమ్మంపాడుకు చెందిన అంగడాల నాగరాజు, తొర్లపాడుకు చెందిన మెట్టిల మణికంఠ రామకృష్ణకు చెందిన పొట్టేళ్లు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, యన్నం సత్యనారాయణరెడ్డి, వేమిరెడ్డి వెంకటరెడ్డి, శీలం వెంకటేశ్వరరెడ్డి, గూడూరు శ్రీనివాసరెడ్డి, వేమిరెడ్డి జనార్దన్‌రెడ్డి తదితరులు తెలిపారు.

వైదిక కమిటీలో విభేదాలు

ఉత్సవాల వేళ భద్రాద్రి పుణ్యక్షేత్రంలో ఇరువర్గాల లొల్లి



రామాలయం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం వైదిక కమిటీలో నెలకొన్న విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ నెల 30, 31వ తేదీల్లో శ్రీరామనవమి, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయంలోని అర్చకులు, వేదపండితులు, అధికారులతో కూడిన వైదిక కమిటీలో ఇరువర్గాల లొల్లితో ఏం జరుగుతుందోనని దేవస్థాన ఉద్యోగులు, సిబ్బందిలో తీవ్ర చర్చ జరుగుతోంది. వైదిక కమిటీలో ప్రస్తుతం ఉన్న ప్రధాన అర్చకుడు, ఇతర సభ్యులతో పాటు రెండో ప్రధాన అర్చకుడికి స్థానం కల్పించాలని కొద్ది రోజులుగా ఒక వర్గం దేవాదాయ శాఖ అధికారులకు, ఈఓకు వినతిపత్రాలను అందచేస్తూ డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రధాన అర్చకుడికి స్థానం కల్పిస్తే ఉత్సవాల్లో పాల్గొనబోనని ఆ వైదిక కమిటీలోని ప్రధాన సభ్యుడు తేల్చిచెప్పినట్టు సమాచారం. దీనికి ప్రతిగా ప్రత్యర్థి వర్గం సైతం వైదిక కమిటీలో చోటు కల్పించకపోతే ఉత్సవాల విధులను బహిష్కరిస్తామని చెప్పారు. ఈ క్రమంలో రెండు, మూడు రోజుల క్రితం వైదిక కమిటీలోని సదరు ప్రధాన సభ్యుడు... వైదిక కమిటీలోని ప్రతి ఒక్కరూ తాను ఉత్సవాల్లో పాల్గొనటానికి ఆహ్వానిస్తూ లేఖ రాసి ఇస్తేనే ఉత్సవాలలో పాల్గొంటానని చెప్పినట్లు తెలుస్తోంది. దీనికి సైతం ప్రత్యర్థివర్గం సభ్యులు తాడోపేడో తేల్చుకుంటామని, లేఖ మాత్రం రాసిచ్చేది లేదని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ఇలా వాద ప్రతివాదాలతో కొద్ది రోజులుగా వైదిక కమిటీ వివాదం నడుస్తోంది. దేవాదాయ శాఖ ఉన్నత వర్గాలు ఇప్పటికైనా కలుగచేసుకొని రామాలయం పరువు ప్రతిష్టలకు భంగం కలగకుండా చూడాలని, వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని భక్తులు కోరుతున్నారు.

ఇద్దరు అర్చకుల గైర్హాజరుపై వివరణ కోరిన ఈఓ

స్వామి వారికి గత శుక్రవారం సాయంత్రం సార్వభౌమ తిరువీధి సేవ జరిగింది. సేవకు విధుల్లో ఉండాల్సిన ఇద్దరు అర్చకులు గైర్హాజరయ్యారని, దీనిపై విచారణ జరిపి వివరణ ఇవ్వాలని ఈఓ రమాదేవి శనివారం ఇద్దరు ప్రధాన అర్చకులను ఆదేశించినట్లు తెలుస్తోంది. అర్చకుల గైర్హాజరుపై పక్కా సమాచారం ఉందని, వైదిక కమిటీ వివరణ అనంతరం వారిపై చర్యకు అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ గైర్హాజరు తతంగం సైతం మరో వర్గం వారే బహిర్గతం చేసి ఈఓ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై ఈఓ రమాదేవిని వివరణ కోరగా.. అర్చకుల గైర్హాజరుపై వివరణ కోరిన మాట వాస్తవమేనని తెలిపారు.

గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పక్కా సమాచారంతో ఆదివారం ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. విశ్వసనీయ సమాచారం మేరకు భద్రాచలం చెక్ పోస్ట్ వద్ద ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సామ్యేల్ జాన్, ఎస్‌ఐ ముభాసిర్, హెడ్ కానిస్టేబుల్ ఖరీం నిఘా వేశారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా యువకులు అక్కడి చెక్ పోస్ట్ నుంచి వెళ్లిపోవడాన్ని గమనించి వెంటపడ్డారు. ఈ క్రమంలో వారు పాల్వంచ మండలం పెద్దమ్మగుడి వద్ద ఆగినట్లు అనుమానంతో అక్కడ అనుమానస్పదంగా ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో మోటార్ సైకిల్, ఏడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారిస్తున్న సమయంలో హన్మకొండకు చెందిన జన్ను మనోహర్ అనే వ్యక్తి మూత్ర విసర్జన పేరుతో సిబ్బంది కళ్లు గప్పి పరారయ్యాడు. అతడిని పట్టుకునేందుకు పోలీస్ సిబ్బంది ప్రయత్నించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, మిగతా ఇద్దరు చదువుకునే విద్యార్థులుగా గుర్తించారు. ఈ విషయంపై పాల్వంచ సీఐ గురునాథ్‌రాథోడ్ ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సీఐ 'సాక్షి'తో మాట్లాడుతూ మనోహర్‌పై గతంలోనూ అనేక కేసులు ఉన్నాయని, అతడిని కచ్చితంగా పట్టుకుంటామని, మిగతా ఇద్దరికి ఈ ఘటనతో ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

బ్రాహ్మణులు ఐక్యంగా ముందుకు సాగాలి



ఎమ్మెల్సీ సురభి వాణీదేవిని సత్కరిస్తున్న ఎస్పీ శైలజ, సముద్రాల వేణుగోపాలచారి

రాజమహేంద్రవరం రూరల్: రాజకీయాలకు అతీతంగా బ్రాహ్మణ సామాజికవర్గం ఐక్యంగా ముందుకు సాగాలని, అప్పుడే ప్రాధాన్యం లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి అభ్యర్థి ఎక్కడ పోటీ చేసినా గెలిపించడానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్‌లోని కాతేరు వద్ద వెంకటాద్రి గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ మహిళా సదస్సు ఆదివారం జరిగింది. తెలంగాణ ఎమ్మెల్సీ, మాజీ ప్రధాని పీవీ కుమార్తె సురభి వాణీదేవి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, శ్రీశక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి మాతాజీ శ్రీ రమ్యానంద భారతి, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యవాడ దుర్గాప్రసాద్, కోనూరు సతీష్‌శర్మ, కోశాధికారి హెచ్‌కే మనోహర్, రాష్ట్ర మహిళాధ్యక్షురాలు రెంటచింతల దీప్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ తోలేటి శిరీష తదితరులు హాజరయ్యారు.

ప్రభుత్వ మద్దతు అమోఘం

- అందుకే మా పెట్టుబడులను ఇక్కడే భారీగా విస్తరిస్తున్నాం
- జీఐఎస్ వేదికగా ప్రపంచానికి చాటిచెప్పిన పారిశ్రామికవేత్తలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇప్పటికే వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్న పారిశ్రామిక దిగ్గజాలు తమ భారీ విస్తరణ ప్రణాళికలను ప్రకటించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై తమకున్న విశ్వాసాన్ని గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సు వేదికగా ప్రపంచానికి చాటిచెప్పారు. విశాఖలో జరిగిన రెండ్రోజుల జీఐఎస్ సదస్సులో కొత్త పరిశ్రమలు, పెట్టుబడుల ఒప్పందాలను కుదుర్చుకోవడమే కాకుండా ఇప్పటికే కార్యకలాపాలు కొనసాగిస్తున్న వివిధ సంస్థలు తమ భారీ విస్తరణ కార్యక్రమాలను ప్రకటించాయి. రిలయన్స్ గ్రూపు దగ్గర నుంచి కొత్త తరం నోవా ఎయిర్ సంస్థ వరకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందిస్తున్న తీరును సభా వేదికగా కీర్తించాయి. అంతేకాక.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి రండి అంటూ ఇతర పారిశ్రామికవేత్తలను ఆయా సంస్థల అధిపతులు ఆహ్వానించడం విశేషం. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ ఆయిల్ అండ్ గ్యాస్, టెలికాం, రిటైల్ వంటి వ్యాపారాల్లో ఇప్పటికే రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టామని.. ఇప్పుడు ఈ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మద్దతుతో మరో రూ.50,000 కోట్లతో 10 గిగావాట్ల రెన్యువబుల్ సోలార్ ఎనర్జీ పార్కును ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించారు.

అదానీ మరో రూ.43,664 కోట్లు

అలాగే.. అదానీ గ్రూపు పోర్టులు, సిమెంట్ వంటి రంగాల్లో రాష్ట్రంలో సుమారు రూ.20,000 కోట్ల పెట్టుబడులు పెట్టగా భవిష్యత్తులో ఆయా రంగాల్లో సామర్థ్యాన్ని రెట్టింపు చేయనున్నట్లు ఏపీ సెజ్ సీఈఓ కరణ్ అదానీ ప్రకటించారు. రాష్ట్రంలో డేటా సెంటర్, గ్రీన్ ఎనర్జీతో పాటు వివిధ రంగాల్లో రూ.43,664 కోట్ల పెట్టుబడులను పెట్టే విధంగా అదానీ గ్రూపు ఒప్పందం కుదుర్చుకుంది. ఇక లాక్‌డౌన్ కాలంలో తక్కువ సమయంలో యూనిట్‌ను ప్రారంభించామని, దీనికి రాష్ట్ర మద్దతే కారణమని నోవా ఎయిర్ సీఈఓ, ఎండీ గజానన్ నంబియార్ స్పష్టంచేశారు. సాధారణంగా ఆక్సిజన్ వంటి పారిశ్రామిక వాయువుల తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేయడానికి కనీసం 18 నుంచి 24 నెలల సమయం పడుతుందని, కానీ కేవలం 14 నెలల కాలంలోనే యూనిట్‌ను ప్రారంభించి వేలాది మంది జీవితాలను కాపాడినట్లు ఆయన తెలిపారు.


జేఎస్‌డబ్ల్యూ రూ.50,632 కోట్లు

జిందాల్ స్టీల్ పవర్ చైర్మన్ నవీన్ జిందాల్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో ఏపీ పారిశ్రామిక రాష్ట్రంగా ఎదగనుందన్నారు. అందుకే తన సోదరుడికి చెందిన జేఎస్‌డబ్ల్యూ రూ.50,632 కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. ఇక, ఇతర రాష్ట్రాలతో పోటీపడి ఆంధ్రప్రదేశ్ బల్క్ డ్రగ్ పార్కును దక్కించుకుంది. దీనితో రాష్ట్రంలో ఫార్మా రంగం మరింతగా విస్తరించనుంది. సాధారణంగా ఫార్మా పరిశ్రమ స్థాపనకు మూడు నుంచి నాలుగేళ్లు పడుతుందని, కానీ అన్ని అనుమతులున్న బల్క్ డ్రగ్ పార్కులో తక్షణం కార్యకలాపాలు మొదలుపెట్టే అవకాశం కలుగుతుందని దివీస్ ఫార్మా వైస్ ప్రెసిడెంట్ మధుబాబు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా రంగానికి ఇస్తున్న మద్దతుతో తాము మరింతగా కార్యకలాపాలు విస్తరించడానికి రూ.వేల కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు దివీస్, లారస్, హెటిరో, అపోలో తదితర సంస్థలు ప్రకటించాయి. రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేస్తున్న సంస్థలు ఇలా భారీ విస్తరణ ప్రణాళికలు ప్రకటించడంతో రాష్ట్రం నుంచి పెట్టుబడులు వెళ్లిపోతున్నాయంటూ తెలుగుదేశంతో పాటు దాని అనుబంధ పత్రికల దుష్ప్రచారానికి తెరపడుతుందని భావిస్తున్నట్లు పారిశ్రామికవేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

సంస్థ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి
ఎన్టీపీసీ	2,35,000	77,000
జేఎస్‌డబ్ల్యూ	50,632	9,500
రిలయన్స్	50,000	10,000
అదానీ గ్రూపు	43,664	53,815
హెచ్‌పీసీఎల్	14,320	1,500
అరబిందో	10,365	5,250
ఆదిత్య బిర్లా	9,300	2,850
ఐటీసీఎల్	4,300	1,500
సన్నీ ఆప్టెక్	2,500	2,000
అల్ట్రాటెక్	2,500	2,000
ఆంధ్రా పేపర్	2,000	2,300
మాండలీజ్	1,600	150
లారస్ గ్రూపు	1,210	1,700
దివీస్	1,100	3,700
సెల్‌కాన్ రిజల్యూట్	1,000	5,000

వైజాగ్.. ఓ బ్రాండ్ సిటీ..

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో పెరిగిన విశాఖ ఇమేజ్
- నగర అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకదృష్టి



సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరంలో ఓవైపు కడలి కెరటాలు.. మరోవైపు పెట్టుబడులు పోటెత్తాయి. బెస్త గ్రామం నుంచి మహానగరంగా మారిన విశాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్). పరిపాలన రాజధానిగా కాబోతున్న నేపథ్యంలో వైజాగ్.. ఓ బ్రాండ్ సిటీ అయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ నగరానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. సదస్సు విజయవంతం అయిన తర్వాత 'దేశానికి ఆర్థికకోట విశాఖ..' అని అందరి నోటా ఒకే మాట. జీఐఎస్–2023తో పెట్టుబడుల స్వర్గధామంగా సరికొత్త ఇమేజ్‌కు నాంది పలికిన వైజాగ్.. ఇదే స్ఫూర్తితో జీ–20 సదస్సుకు సిద్ధమవుతోంది. రాజధానులెన్నింటికో రాదారిగా ఉన్న విశాఖపట్నాన్ని పరిపాలన రాజధానిగా మార్చాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం సిద్ధించే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. చోదకశక్తి కేంద్రాలుగా మారుతున్న ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల జాబితాలో అగ్రభాగంలో ఉన్న విశాఖపట్నంలో రెండురోజులు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సూపర్ సక్సెస్ అయింది. ప్రణాళికాబద్ధంగా నిర్మితమైన నగరంగా విశాఖకు ఈ సమ్మిట్ నిర్వహణతో అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. గత ప్రభుత్వ హయాంలో మూడుమార్లు పెట్టుబడుల సదస్సులు నిర్వహించినా రాని ఇమేజ్.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటిసారి ఏర్పాటు చేసిన జీఐఎస్‌తో వైజాగ్ పేరు ఖండాంతరాలు దాటింది. సీఎం వైఎస్ జగన్ బ్రాండ్ అంబాసిడర్‌గా నిర్వహించిన సమ్మిట్‌కు దేశవిదేశాలకు చెందిన దిగ్గజ పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు హాజరై విశాఖ నగర వైభవానికి వావ్ అన్నారు.

కొత్త ఇమేజ్ తీసుకొచ్చారు

ఇన్నాళ్లు.. విశాఖపట్నం అంటే అలల సవ్వడులతో.. అందాల నగరంగా.. పర్యాటక ప్రాంతంగా మాత్రమే గుర్తింపు ఉండేది. కానీ.. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించిన తర్వాత నగరానికి సరికొత్త ఇమేజ్ వచ్చింది. ఎవరు వచ్చినా ఆహ్వానించదగ్గ ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న విశాఖ నగరంలో తమ వ్యాపార కార్యకలాపాలు విస్తరించాలన్న ఆలోచనల్ని పారిశ్రామికవేత్తలు స్వయంగా చూసిన తర్వాత మరింత బలపరుచుకున్నారు. నివాసయోగ నగరాల్లో టైర్–1 సిటీలతో పోటీపడుతున్న విశాఖపట్నం పెట్టుబడులకు కూడా ప్రధాన కేంద్రంగా మారింది. హైదరాబాద్‌ని మించి అభివృద్ధి చేసే అవకాశాలున్నప్పటికీ.. గత పాలకులు విశాఖని ఒక నగరంగానే గుర్తించి విస్మరించడంతో అనుకున్న మేర అభివృద్ధి చెందలేదు. కానీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపై ప్రత్యేకశ్రద్ధ వహించారు. నగరానికి కొత్త ఇమేజ్ తీసుకొచ్చేందుకు ఆలోచనలు కార్యరూపం దాల్చేలా అడుగులు వేశారు. అనుకున్నట్లుగానే పెట్టుబడుల సదస్సుతో 'తింటే గారెలే తినాలి.. వింటే భారతం వినాలి.. ఉంటే వైజాగ్‌లోనే ఉండాలి.. చేస్తే విశాఖలోనే వ్యాపారం చేయాలి..' అనే స్థాయికి తీసుకెళ్లారు.

మానవ తప్పిదమే

- డయాఫ్రమ్ వాల్ డ్యామేజీపై తేల్చేసిన ఎన్‌హెచ్‌పీసీ
- చంద్రబాబు నిర్వాకాలు తేటతెల్లం

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరంపై చంద్రబాబు సర్కారు అనాలోచిత నిర్ణయాలు.. ప్రణాళికా రాహిత్యం.. కమీషన్ల దాహంతోనే డయాఫ్రమ్ వాల్ దెబ్బ తిందని ఆది నుంచి చెబుతున్న వాస్తవాలను ఎన్‌హెచ్‌పీసీ నివేదిక అధికారికంగా ధ్రువీకరించింది. గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా అప్రోచ్ చానల్, స్పిల్‌వే, స్పిల్ చానల్, పైలట్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండా టీడీపీ సర్కారు ప్రధాన డ్యామ్ గ్యాప్–2లో 1,750 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించడం ఘోర తప్పిదమని నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) రాష్ట్ర జలవనరుల శాఖకు సమర్పించిన నివేదిక తేల్చి చెప్పింది. ఆ మానవ తప్పిదం వల్లే 2,400 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరి.. ఎగువ కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారడంతో ఖాళీ ప్రదేశం 800 మీటర్లకు కుచించుకుపోయి ప్రవహించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఇది వరద ఉధ్ధృతి తీవ్రతరం కావడానికి దారితీసింది. అందువల్లే ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో గ్యాప్–1లో 35 మీటర్లు, గ్యాప్–2లో 20 మీటర్ల లోతుతో భారీ అగాధాలు ఏర్పడ్డాయని స్పష్టం చేసింది. గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ ఎడమ వైపున 175 మీటర్ల నుంచి 363 మీటర్ల వరకు ధ్వంసం కాగా కుడి వైపున 1,170 నుంచి 1,370 మీటర్ల వరకు పూర్తిగా ధ్వంసమైందని తేల్చింది. 480 మీటర్ల నుంచి 510 మీటర్ల వరకు, 950 మీటర్ల నుంచి 1,020 మీటర్ల వరకు రెండు చోట్ల 20 మీటర్ల లోతు వరకూ డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని తేల్చింది. ఫలితంగా భూగర్భంలో గోదావరి ప్రవాహాన్ని సమర్థంగా అడ్డుకట్ట వేయలేదని పేర్కొంది. డయాఫ్రమ్ వాల్‌ను పటిష్టం చేసే చర్యలు చేపడితేనే లీకేజీలకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చని తెలిపింది.

ఎన్‌హెచ్‌పీసీ సమగ్ర అధ్యయనం..

పోలవరం వద్ద భౌగోళిక పరిస్థితుల రీత్యా వరద ప్రవాహాన్ని మళ్లించే స్పిల్‌వేను నదీ తీరానికి కుడి వైపున రాతి నేలపై, 194.6 టీఎంసీలను నిల్వ చేసే ప్రధాన (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్‌ను నదికి అడ్డంగా నిర్మించేలా కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ప్రాజెక్టు డిజైన్‌ను ఆమోదించింది. ప్రధాన డ్యామ్‌కి పునాదిగా డయాఫ్రమ్ వాల్ వేయాలని పేర్కొంది. డయాఫ్రమ్ వాల్‌ను నిర్మిస్తేనే భూ గర్భంలో గోదావరి ప్రవాహం ఎగువకు నుంచి దిగువకు, దిగువ నుంచి ఎగువకు వెళ్లకుండా అడ్డుకుంటుంది. అంటే లీకేజీ (ఊట నీరు)కి పూర్తిగా అడ్డుకట్ట వేస్తుంది. ఇది ప్రధాన డ్యామ్ చెక్కు చెదరకుండా కాపాడుతుంది. ప్రధాన డ్యామ్‌కు అత్యంత కీలకమైన డయాఫ్రమ్ వాల్‌ను గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించే పనులు పూర్తి చేశాకే చేపట్టాలి. గత సర్కారు అనాలోచితంగా అందుకు విరుద్ధంగా చేపట్టడంతో 2019లో వచ్చిన వరద ఉధ్ధృతికి డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఈ క్రమంలో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, నిపుణులను రాష్ట్ర ప్రభుత్వం సంప్రదించింది. సీడబ్ల్యూసీ సూచనల మేరకు ఎన్‌హెచ్‌పీసీకి ఈ బాధ్యతను అప్పగించింది.

ఈ పాపం.. చంద్రబాబుదే

పోలవరం ప్రాజెక్టును వంద శాతం వ్యయంతో తామే పూర్తి చేస్తామని విభజన చట్టం సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. కేంద్రమే పూర్తి చేయాల్సిన పోలవరాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని నాడు సీఎం హోదాలో చంద్రబాబు కోరారు. ప్రత్యేక హోదాను కూడా తాకట్టు పెట్టేందుకు సిద్ధం కావడంతో 2016 సెప్టెంబరు 6న ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అప్పగించింది. ఈ క్రమంలో 2013–14 ధరల ప్రకారమే నీటిపారుదల విభాగం వ్యయంలో మిగిలిన మొత్తాన్ని మాత్రమే రీయింబర్స్ చేస్తామని కేంద్రం విధించిన షరతులకు చంద్రబాబు తలొగ్గారు. రూ.3,302 కోట్ల విలువైన జలాశయం పనులను 'ఈనాడు' రామోజీరావు వియ్యంకుడికి చెందిన నవయుగకు, ఎడమ కాలువలో రూ.150 కోట్ల పనులను నాటి ఆర్థిక మంత్రి యనమల వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్‌కు నామినేషన్‌పై కట్టబెట్టారు. వరదను మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్, కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండా డయాఫ్రమ్ వాల్‌ను పూర్తి చేశారు. ఈ పాపాల కారణంగానే డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది.

కోతకు గురైన ప్రాంతంలో కొత్త డయాఫ్రమ్ వాల్

- దెబ్బతిన్న చోట సమాంతరంగా కొత్తగా నిర్మాణం
- మరో రెండు చోట్ల సరిదిద్దే విధానంపై సీడబ్ల్యూసీతో చర్చ

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జిల్లా వార్తలు

సృజనాత్మకతను వెలికితీయాలి



మాట్లాడుతున్న ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ మొహంతి

బూర్గంపాడు: పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించాలని ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ సిద్ధార్థ మొహంతి సూచించారు. ఆదివారం సారపాకలోని ఐటీసీ కళాభారతిలో రోటరాక్ట్ 17వ ఇంటర్ స్కూల్ ప్రజ్ఞ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, చదరంగం, సుడోకో, స్పెల్‌బీ, యునిక్ పోటీలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ రోటరాక్ట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞ పోటీలు నిర్వహించటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు టీఎస్ భాస్కర్‌రావు, కార్యదర్శి డాక్టర్ విజయ్‌కుమార్, రోటరీ ప్రతినిధులు రాజశేఖర్, శ్యామ్‌కిరణ్, మారడాన శ్రీనివాస్, సాయిరామ్, నంతియా, వెన్సస్ పాల్గొన్నారు.

కిన్నెరసానిలో జన సందోహం

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని జలాశయం, పార్కుకు ఆదివారం జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. 596 మంది పర్యాటకులు తరలిరాగా వైల్డ్‌లైఫ్‌శాఖకు రూ.19,665 ఆదాయం లభించింది. 250 మంది బోటుషికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.13,430 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ 'సారీ'.. కష్టమేనా?!

- సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి మిగిలింది 25రోజులే..
- ఈ ఆర్థిక సంవత్సరం ఇంకా పది మిలియన్ టన్నులు బాకీ
- రోజువారీ లక్ష్యసాధనలో వెనుకబడినా అధికారుల్లో మాత్రం ధీమా



ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ గడచిన మూడేళ్ల మాదిరిగానే ఈ ఏడాది కూడా నిర్దేశిత లక్ష్యాన్ని సాధించడం కష్టమేనని తెలుస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల లక్ష్యంతో ఉత్పత్తి ప్రారంభించింది. గత 11 మాసాల్లో 66.50 మిలియన్ టన్నుల లక్ష్యానికి గాను.. సింగరేణి వ్యాప్త 11 ఏరియాల్లోని 18 ఓపెన్‌కాస్ట్, 24 భూగర్భ గనుల్లో 59.90 మిలియన్ టన్నులు(90 శాతం) మాత్రమే ఉత్పత్తి సాధించారు. ఈ సమయంలోనే సుమారు 6.60 మిలియన్ టన్నులు వెనుకంజలో ఉండగా.. మార్చితో కలుపుకుంటే 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించాల్సి ఉంది. అంటే మిగిలిన 25 రోజుల్లో ఇది సాధ్యమేనని అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ ఇప్పటికి రోజుకు 2.77 లక్షల టన్నుల ఉత్పత్తికి గాను 2.21 లక్షల టన్నుల ఉత్పత్తే నమోదవుతుండగా 20 శాతం వెనుకంజలో ఉందని సింగరేణి గణాంకాల ద్వారా తెలుస్తోంది.

అంచనా తారుమారు...

సింగరేణి సంస్థ ఈ ఏడాది కొత్తగూడెం ఏరియాలోని వీకె–7 షాఫ్ట్ ద్వారా 10 మిలియన్ టన్నులు, ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే నైనీ బ్లాక్‌కు స్టేజ్ –1 అనుమతులే వచ్చాయి. వీకె–7 ఓపెన్‌కాస్ట్ గనికి స్టేజ్–1 అనుమతులు ఇంకా రాలేదు. ఈ రెండు గనులకు అనుమతి వచ్చి ఉంటే కనీసం గనికి 5 చొప్పున 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి సులువయ్యేది. కానీ కంపెనీ అంచనా తారుమారు కావడంతో ఇప్పుడు కార్మికులపై భారం మోపినట్లయింది. ఏటా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో కార్మికులు సెలవులు పెట్టకుండా ప్లే డే (ఆదివారం పనిదినం) కూడా పని చేస్తూ ఉత్పత్తి పెంచినందుకు స్పెషల్ ఇన్సెంటివ్ ఇచ్చేవారు. దీంతో వారు ఉత్సాహంగా పనిచేసి లక్ష్యసాధనలో పాలు పంచుకునే వారు. కానీ ఈసారి కార్మికులకు ఇన్సెంటివ్‌లో కొర్రీ పెట్టడం గమనార్హం.

నాలుగు ఏరియాల్లోనే 100 శాతం..

సింగరేణి సంస్థ ప్రతీ నెల ఏరియాల వారీగా ఉన్న గనులు, ఓసీల్లో లక్ష్యాన్ని నిర్దేశించుకుంటుంది. ఈ క్రమంలో గత ఫిబ్రవరిలో కేవలం నాలుగు ఏరియాల్లోనే వంద శాతం ఉత్పత్తి నమోదైంది. ఇల్లెందు ఏరియా 135 శాతం, శ్రీరాంపూర్ 115 శాతం, ఆర్జీ–1 110 శాతం, కొత్తగూడెం 102 శాతం సాధించగా మిగిలినవి వెనుకబడ్డాయి.

కొత్తగూడెం ఏరియా పెద్దన్నపాత్ర..

సింగరేణి వ్యాప్త 11 ఏరియాల్లో కొత్తగూడెం ఏరియా ఫిబ్రవరిలో నిర్దేశించిన 12.50 లక్షల టన్నుల లక్ష్యానికి 12.73 లక్షల టన్నుల ఉత్పత్తితో పెద్దన్న పాత్ర పోషించింది. అలాగే, గత 11 నెలల్లోనూ 12.56 మిలియన్ టన్ను లక్ష్యానికి గాను 11.42 మిలియన్ టన్నుల ఉత్పత్తి (91 శాతం) సాధించడం విశేషం. అంతేకాక 11.98 మిలియన్ టన్నుల బొగ్గును రవాణా చేసి సింగరేణి వ్యాప్తంగా మొదటి స్థానంలో నిలిచింది.

ఉత్పత్తి 90 శాతమే..

11 మాసాల్లో సింగరేణి సాధించాల్సిన 6,65,08,768 టన్నుల లక్ష్యానికి 5,99,05,833 టన్నులు(90శాతం) నమోదైంది. వీటిలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న 24 భూగర్భ గనుల్లో 80,83,434 టన్నుల లక్ష్యానికి 59,51,745 టన్నులు(74 శాతం) సాధించగా, 18 ఓపెన్‌కాస్ట్ గనుల్లో 5,84,25,334 టన్నుల లక్ష్యానికి 5,39,54,088 టన్నులు(92 శాతం) సాధించాయి. ఓవరాల్‌గా చూస్తే 11 మాసా ల్లో 90 శాతం ఉత్పత్తి మాత్రమే సాధ్యమైంది.

11 మాసాల్లో సింగరేణి సాధించిన ఉత్పత్తి వివరాలు

ఏరియా	లక్ష్యం	ఉత్పత్తి	శాతం
ఆర్జీ–1	35,24,500	40,46,209	115
మణుగూరు	1,04,61,509	1,13,41,932	108
ఇల్లెందు	41,80,750	44,32,214	106
ఆర్జీ–2	78,36,526	78,36,526	102
శ్రీరాంపూర్	60,39,708	58,85,428	97
కొత్తగూడెం	1,25,62,846	1,14,26,590	91
ఆర్జీ–3	55,35,417	48,71,852	88
మందమర్రి	48,91,983	37,84,580	77
బెల్లంపల్లి	31,95,833	24,31,368	76
ఆండ్రియాల	19,45,542	14,33,237	74
భూపాలపల్లి	44,23,084	24,15,897	55

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



పాండురంగాపురంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

పాల్వంచరూరల్/సింగరేణి(కొత్తగూడెం): రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాల్వంచ మండలం పాండురంగాపురంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని రైతులకు చేయూత అందించాలని కోరారు. ఇంధన, నిత్యావసర సరుకుల ధరల పెంపుతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, దీనికి తోడు ఇటీవల వంట గ్యాస్ ధరలను కూడా పెంచి కేంద్ర ప్రభుత్వం పేదోడి నడ్డి విరుస్తోందని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు గృహవసతి కల్పించి వారి సొంతింటి కల నెరవేర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తిస్థాయిలో జరగడం లేదన్నారు. పేదలు లక్షల సంఖ్యలో ఉంటే వేలల్లో ఇళ్లు కడితే ఎలా అని ప్రశ్నించారు. సొంత స్థలం ఉన్నవారు ఇల్లు నిర్మించుకుంటే రూ.6 లక్షల చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో డబ్బు సంచులతో కొత్తగూడెం నియోజకవర్గానికి వచ్చే టూరిస్ట్ నాయకులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ పాలకులు, అధికారులను నిలదీసే సత్తా గల కమ్యూనిస్టు పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. సమావేశంలో పార్టీ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబు, ఉప్పుశెట్టి రాహుల్, గుండెపురి రాజు, ఇరకులపాటి నారాయణ, భూక్యా రమేష్, కోటి నాగేశ్వరరావు, నెల్లూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర చట్టం కోసం ఉద్యమించాలి

సమగ్ర శాసన చట్టం కోసం రవాణా కార్మికులు ఉద్యమించాలని కూనంనేని పిలుపునిచ్చారు. కొత్తగూడెంలో ఆదివారం నిర్వహించిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ వాహనాలు నడుపుతూ జీవనోపాధి సాగించే కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. స్వయం ఉపాధితో బతుకుతున్న ఆటో కార్మికులను పాలకులు పన్నుల రూపంతో దోచుకుంటున్నారని విమర్శించారు. పోలీసులు విధించే ఈ చాలాన్లు వారికి మరింత భారంగా మారాయని, సరైన పార్కింగ్‌లు, అడ్డాలు ఏర్పాటు చేయకుండా చలాన్లు ఎలా వసూలు చేస్తారని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు కంచర్ల జమలయ్య, వై.శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, అబ్బులు, గోవర్దన్, బత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష కొనసాగుతోంది

పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య



టేకులపల్లిలో మాట్లాడుతున్న సంధ్య

టేకులపల్లి/మహబూబాబాద్ అర్బన్: ప్రపంచ వ్యాప్తంగా నేటికీ మహిళలపై వివక్ష కొనసాగుతోందని, వివక్ష రూపుమాపాలంటే ప్రజలందరూ అక్షరాస్యులుగా మారాల్సిన అవసరం ఉందని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సంధ్య అన్నారు. ఆదివారం ఆమె మహబూబాబాద్, టేకులపల్లిలో జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. సమాజంలో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అసమానతలు తొలగితేనే మహిళలపై లైంగికదాడులు తగ్గుతాయన్నారు. సమాజాన్ని, విద్యార్థులను, ప్రజలను చైతన్యపరిచే బాధ్యత ఉపాధ్యాయులపై ఎక్కువ ఉందన్నారు. మహిళా కార్మికుల శ్రమదోపిడీ, లింగవివక్షకు వ్యతిరేకంగా 113 సంవత్సరాల క్రితం జరిగిన వీరోచిత పోరాటంలో ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారని, దానికి గుర్తుగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించారని చెప్పారు. అంతటి ప్రాముఖ్యత గలిగిన రోజును పాలకులు సన్మానాలు, అవార్డులు, వంటలు, ముగ్గుల పోటీలకు పరిమితం చేసి, మహిళల పోరాట స్ఫూర్తిని నీరు గారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 8ని మహిళా హక్కుల సాధన, శ్రామిక పోరాట దినంగా నిర్వహించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. వరంగల్ కేఎంసీలో ప్రీతి అనే మెడికో మృతి ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లిక్కర్ అమ్మకాలు అధికంగా పెంచేందుకు మద్యం పాలసీని మరింత సులభతరం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సమావేశంలో పీఓడబ్ల్యూ భద్రాద్రి జిల్లా గౌరవాధ్యక్షురాలు నోముల కళావతి, మండల అధ్యక్ష, కార్యదర్శులు తోటకూరి చిట్టెమ్మ, చింతలాలమ్మ, భూక్య చిన్ని, పీవైఎల్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి నోముల భానుచందర్, మండల కార్యదర్శి తోటకూరి సతీష్‌తో పాటు టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కవిత, మహబూబాబాద్ జిల్లా కౌన్సిలర్ వసంత, పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు గుజ్జు కృష్ణవేణి, గిరిజ, హరిణి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం, నాయకులు రమేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

- సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లకు పరీక్ష నిర్వహణ
- రీజియన్‌లో ఇంటర్‌కు 10,750, డిగ్రీలో ప్రవేశాలకు 3,484 మంది హాజరు



ఖమ్మంలోని ఓ పరీక్ష కేంద్రంలో పర్యవేక్షిస్తున్న ఆర్సీఓ ప్రత్యూష

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకులాల్లో ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరికలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ (సీఓఈ) జూనియర్ కళాశాలల్లో, డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు ఈ పరీక్షలు నిర్వహించామని రీజియన్ కోఆర్డినేటర్ కె.ప్రత్యూష తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

జూనియర్ కళాశాలల్లో..

ఖమ్మం రీజియన్ పరిధిలో ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 11,344 మంది విద్యార్థులకు గాను 10,750 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో బాలురు 4,588, బాలికలు 6,162 మంది పరీక్షకు హాజరు కాగా, మొత్తం 94.76 శాతంగా హాజరు నమోదైంది.

- ఖమ్మం జిల్లా నుంచి మొత్తం 5,907 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 5,571 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో బాలురు 2,089, బాలికలు 3,482 మంది ఉన్నారు.
- భద్రాద్రి జిల్లాలో మొత్తం 3,085 మంది విద్యార్థులకు గాను 2,922 మంది హాజరయ్యారు. ఇందులో బాలురు 1,137, బాలికలు 1,785 మంది ఉన్నారు.
- మహబూబాబాద్ జిల్లా నుంచి మొత్తం 2,352 మంది విద్యార్థులకు గాను 2,257 మంది హాజరయ్యారు. ఇందులో బాలురు 1,362 మంది, బాలికలు 895 మంది ఉన్నారు.

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం..

ఖమ్మం రీజియన్ పరిధిలో ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 3,718 మందికి గాను 3,484 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా.. 234 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 93.70 శాతం హాజరు నమోదైంది.

- ఖమ్మం జిల్లా నుంచి 1992 మంది విద్యార్థులకు గాను 1875 మంది పరీక్షకు హాజరు కాగా.. 117 మంది గైర్హాజరయ్యారు.
- భద్రాద్రి జిల్లాలో మొత్తం 1174 మందికి గాను 1109 మంది పరీక్షకు హాజరు కాగా.. 65 మంది గైర్హాజరయ్యారు.
- మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 552 మందికి గాను 500 మంది పరీక్షకు హాజరు కాగా.. 52 మంది గైర్హాజరయ్యారు.